


# అపస్వరాలు

ఏది సత్యం? ఏ దసత్యం? అన్న మీమాంసలో పడ్డాడు, ఆ శ్యాంసుందరుని కుమారుడూ, రామచంద్రుని మనుమడూ అయిన బుచ్చిబాబు. అప్పటి కతని వయసు ఇరవై రెండేళ్ళు. పి. యు. సి. పాసయి మూడు నెలలైంది. తండ్రి పోయి మూడు వారాలైంది.

"మా బాకీలసంగతేమి" టని నలుగురూ వచ్చి నానా మాటలూ అని మూడు రోజులయింది. తిండితిని మూడు పూటలయింది. పక్క ఇంటి రామాయమ్మగారు దయతో ఇచ్చిన టీ తాగి మూడు గంటలయింది. "అర్నెల్ల అద్దె బాకీ. బాకీ చెల్లించకపోతే పోనీ ఇల్లయినా ఖాళీ చేయండి. ఫస్టు కేదో నిశ్చయించి చెప్పండి" అని ఇల్లుగలాయన నోటీసిచ్చి మూడు నిమిషాలయింది. అప్పుడే ఈ మీమాంసలో పడ్డాడు బుచ్చిబాబు. ఏ దారి వెళదామన్నా అసలు తన కేదీ కనిపించడం లేదు. ఏం చేయాలి అని దిగులుగా కూర్చున్నాడు, గుడిపక్క అరుగుమీద.

"ఇక ఇల్లెలాగరా బుచ్చీ! ఏం చేయాలి? ఎవరు వచ్చి మన కాచుకుంటారు. అయ్యో! దేవుడా ఏం గతి!" తల్లి రోదన చెవులో గింగుర్లు పెడుతూంది.

ఏం చేయాలి? తనేం చేయాలి? అసలందరూ ఏం చేస్తారు? చదువుకుంటారు. ఉద్యోగం చేస్తారు. ముందు తల్లిని, తండ్రిని పోషిస్తారు. తరవాత భార్యాపిల్లల్ని పోషిస్తారు. ఆ తరవాత మరణిస్తారు.

తనుకూడా చదువుకున్నాడు. అయితే ఉద్యోగం చేయాలి. కాని ఎలా? ఎక్కడ దొరుకుతుంది ఉద్యోగం?

ఎవరో చెప్పారు— ఉద్యోగం కావాలంటే ఎంప్లాయిమెంటు ఆఫీసులో, ముందు నీ పేరు రిజిస్టరు చేయించు అని. అలాగే చేయించాడు. ఆ వేళ వారడిగారు— ఎలాంటి ఉద్యోగం కావాలి నీకు? ఎంత జీతం కావాలి? ఎక్కడయితే పనిచేస్తావు అని. అతనికెంతో సంతోషమయింది. వచ్చేసిందే అనుకున్నాడు. కాని రాలేదు. మరేం చేయాలి? ఇటు చూస్తే ఏ పూట కాపూటే గడవడం కష్టంగా ఉంది. అటు చూస్తే అప్పులవాళ్ల బాధ. అసలు నాన్న అప్పు లెందుకు చేశాడు? అది అర్థం కావడం లేదు.

నెల గడిచిపోయింది. ఇల్లు ఖాళీ చేయకతప్పింది కాదు. పెద్ద వీధిలోంచి పేటలోకి మారిపోయారు. కాని తిండి?

"ఆ చిదంబరంగారి దగ్గరికోసారి వెళ్లు, బాబూ! ఆదుకుంటే అతనే ఆదుకోవాలిక" అన్నది తల్లి. అది నిజం. తండ్రి శ్రాద్ధకర్మలకీ, తరవాత దిన బత్తానికీ అతనే చాలావరకు ఆదుకున్నాడు. అతను బుచ్చిబాబుకు మామా కాదు. తాతాకాదు. బంధువంతకంటే కాదు. శ్యాంసుందరుని సహోద్యోగి. స్నేహితుడు. అంతే.

"మీ నాన్న నాకు ఆప్తమిత్రుడు. సహోద్యోగి" అంటాడతను.

కాని కిట్టనివాళ్లు— "అతనికీ, మీ

విజయ్
సుఖాన్ని దోహదం చేస్తుంది

మీ పని భారాన్ని తగ్గించేందుకూ, మీ జీవితాన్ని ఎక్కువ ఆనందదాయకంగా చేసేందుకూ విద్యుత్. సాధన సంపత్తిలో ఉత్తమమైన వాటిని విజయ్ మీకు సమకూర్చుతున్నది.



ఉష్ణతను అదుపులో ఉంచే విజయ్ ఇస్త్రీ పని తొందరలో ఉండే గృహిణికి ప్రత్యేకించి అనువుగా ఉండేట్లు తయారు చెయ్యబడింది. దానంతటదే ఉష్ణోగ్రతను అదుపుచేసే సాధనం అమర్చబడియున్న విజయ్‌తో ఇస్త్రీ చేసేప్పుడు వేడిమి ఎలా ఉందోనని ఊహించవలసిన అగత్యం ఉండదు. బాగా, గుడలు కాలటంవల్లగాని, సరిగా తోమబడకపోవటంవల్లగాని కలిగే మనస్తాపం నివారించబడుతుంది. విద్యుచ్ఛక్తి వాడకం ఖర్చు గరిష్ఠంగా కలిసి వస్తుంది. విజయ్ పంకాలు ప్రతి అవసరానికీ అనువుగా రకరకాల నమూనాలలోను, రంగులలోను లభిస్తున్నాయి. మీకు జీవిత పర్యంతం శీతలసౌఖ్యాన్ని సమకూర్చేట్లు, రోజువారీ వాడకంలో ఖర్చు తక్కువగా ఉండేట్లు ప్రత్యేక నైపుణ్యతతో తయారుచెయ్యబడి

Vijay
నేషనల్ ఎలెక్ట్రికల్స్
భారత్ బిల్డింగ్స్, 8/18 మౌంట్ రోడ్డు, మద్రాసు
విజయ్‌తో మీరు సుఖంగా ఉండండి

NAS-199-TG

బ్రాంచీలు: 5-9-201/2, గ్రౌండ్‌ఫ్లోర్, చిరాగ్, అలీ లేన్, హైదరాబాదు-1. * కాయిత్రా బిల్డింగ్సు, ఎమ్. జి. రోడ్, ఎర్నాకులమ్, కొచ్చిన్-16. * యునైటెడ్ బిల్డింగ్, జె. సి. రోడ్డు, బెంగుళూరు-2.

నాటికీ నేటికీ ఆమె అలానే అనుకుంటుంది. కాని, బుచ్చిబాబు మాత్రం అనుకోవడం మానేశాడు. అందుకే ఈ నాటికి తండ్రి చేసిన అప్పులో సగం తీర్చగలిగాడు.

• • •

'జీవితం ఇంత చిత్రమైందని నేనెప్పుడూ అనుకోలేదు' అనుకున్నాడు బుచ్చిబాబు, నడిరోడ్డుపై నిలబడి.

'దిక్కులు రెండే అంటే అవును కాబోలనుకున్నా నానాడు. ఉద్యోగపర్వంలో దిక్కులు రెండు కాదు; ఒకటే అంటాడు తనీనాడు. ఉత్తరం అంటే రికమెండేషను లెటరు. దక్షిణం అంటే డబ్బు. డబ్బు లేనిదే ఉత్తరానికి విలువ లేదు. పెర్మిటుకి ఏభై తీసుకుంటాడు సీతాపతి. కేసుకి ముప్పై తీసుకుంటాడు రామారావు. గుర్నాధం సరేసరి. దొరగారి కాంపు క్లర్కు క్లర్కు అతను. దిగువ ఆఫీసులు దక్షిణలు సమర్పించుకుంటాయి. హెడ్ క్లార్కు, సూపరింటెండెంటూ వారి మడుపులు వేరు. కాని, డిస్పాచింగ్ క్లర్కు తనకూ అడపా దడపా డబ్బులు రావడం కద్దు. మొదట్లో తనకేం తెలియదు. అంతా హె. సి. యే కాజేసేవాడు. గుర్నాధం జోక్యం చేసుకుని తన కా అవకాశం కల్పించాడు. ఇందులో నీతి లేదు. న్యాయం లేదు. నిజమే. కాని, తన తాత చెప్పినట్టు అవి కూడు పెట్టవు. తను న్యాయంగా అడిగితే ఎంప్లాయ్‌మెంటు గుమాస్తా 'నేలేగా సర్వీసు' అని చీదరించుకున్నాడు. ఉద్యోగం వా డివ్వడు. అయినా, అవకాశమిచ్చేది వాడు. అందుకే ఏభై రూపాయల కా అవకాశా న్నమ్ముకున్నాడు. అలా అమ్ముడుపోగా మిగిలే అవకాశాలెన్ని? పవ్యంగా పోయేవారి కవి దొరికే దెప్పుడు? డబ్బు లేనిదే శవంకూడ కదలదు. మరి మనిషి బ్రతికే దెలా?

మెడికల్ షాపులో జొరబడ్డాడు బుచ్చిబాబు. జేబులోంచి చీటీ తీసి చూపించాడు. ఎనిమిది రూపాయలన్నాడు వాడు. పది రూపాయల నోటు తీసి కౌంటరు ముందుంచాడు. మందు వచ్చింది. రాక ఏం చేస్తుంది? అసలీ జబ్బు ఎందుకు వచ్చింది? తను పుట్టినప్పుడే అమ్మకి జబ్బు వచ్చిందట. నాన్న డబ్బులేక మందిప్పించలేకపోయాడు. అంతే. ఇరవై రెండు సంవత్సరాలుగా అది మనిషిని పీల్చి పిప్పి చేస్తూంది. మనిషిగా పుట్టి, మనిషిగా మరణిస్తానన్నారు నాన్న. అంతగా అమ్మ బాధపడితే మనిషిగా అతని మన సెలా ఒప్పింది? పరువూ ప్రతిష్ఠ విడనాడి అక్కలు ఎవరితోనో లేచిపోతే, ఎలా లోకానికి ముఖం చూపగలిగాడు? కాలం మారుతూంది. మారేకాలంతో మనిషీ మారక తప్పదు. అంతే.

"రండి, సార్, రండి. తాజాపూలు. మొగ్గలు మల్లెమొగ్గలు. అలిగే ఆలు మగల్ని కలిపే మొగ్గలు. రండి, సార్, రండి".

మల్లెలు కుప్పలు పోసి అమ్ముతున్నారు. నిలిచిపోయాడు బుచ్చిబాబు. మల్లెల్ని చూస్తూనే రాజ్యం గుర్తుకు వచ్చింది అతనికి. రాజ్యం మంచిపిల్ల. ఆ అల్లరీ, చనువూ తన కెంతో కలవర పెట్టేవి మొదట్లో. అసలు ఆమె అర్థమే కాలేదు తనకి. అందుకే 'మందమతీ! బండ బాబూ!' అని పిలుస్తూండేది. తన నలా ఎందుకు పిలిచేదోకూడా తన కర్థం అయేది కాదు. . .

• • •

ఆఫీసునుండి అప్పుడే ఇంటికి వచ్చాడు బుచ్చిబాబు. ఆ ఇల్లు రెండు భాగాలు. ఒక భాగంలో వీరు. పక్క భాగంలో సుందరమ్మ, ఆమె కూతురు రాజ్యం ఉంటున్నారు. రాజ్యం తండ్రి అయిదేళ్ల క్రితం ఒక ఏక్సిడెంటులో మరణించాడు. ఒక తమ్ముడు తప్ప వెనక ఎవరూ లేని సుందరమ్మ, చేతిలో ఉన్న విద్య ఆధారంతో గుట్టు రట్టు కాకుండా తనూ, కూతురు అలా కాలక్షేపం చేస్తున్నారు. రంగు కాగితాలతో అందమైన పంజరాలూ, పూలూ, చిన్న చిన్న ఆటవస్తువులూ చేస్తుంటుంది. బేరగాళ్లు వచ్చి కొనుక్కుపోతుంటారు.

ఆ రోజు ఉదయం బుచ్చిబాబుకి డబ్బు లిచ్చి, కాగితాలు కొని తెచ్చి పెట్టమంది. అవి వాళ్లింట్లో ఇచ్చేసి తన భాగంలోకి వచ్చాడు. తల్లిని పలకరించాడు. బట్టలు విప్పుకుంటుంటే రాజ్యం పిలుపు వినిపించింది.

"ఓ. బుచ్చిబాబూ!" పిలుపు కాదది. పాటలా ఉంది. అయినా, పిలుపే అనుకుని పలికి, పెరట్లోకి వెళ్లాడు. వాళ్లకీ, వీళ్లకీ అడ్డగా ఉన్న దడి దగ్గర నిలుచుంది రాజ్యం.

"పిలిచావా!" మెల్లగా అడిగాడు.

"ఆఁ" అని కళ్లు తిప్పి, ముగ్ధ మోహనంగా నవ్వి దగ్గరికి వచ్చింది.

"నాకు మల్లెలు ఇష్టమని నీ కెవరు చెప్పారు?" అన్నది.

బిక్కముఖం వేశాడు బుచ్చిబాబు. "నీకా! మల్లెలా!"

"అవును. ఎందు కలా చూస్తావ్." అని చిరునవ్వు నవ్వి, "అబ్బ అలా చూడకు. నాకు సిగ్గు" అని, తల్లి పిలవగా చివాలున తిరిగి తమ భాగంలోకి వెళ్లిపోయింది. ఆ తిరగడంలో కదిలిన వాలుజడ లోని మల్లెలు బుచ్చిబాబుని చూసి ఫక్కుమని నవ్వినాయి. నోరు వెళ్లబెట్టాడు బుచ్చిబాబు. ఆ రోజు అతనూ, సీతాపతీ ఆఫీసునుంచి కలిసి బయలుదేరారు. దారిలో ఆగి మల్లెలు కొన్నాడు సీతాపతి. కాగితాలు కొని సంచిలో వేసుకున్నాడు బుచ్చిబాబు. మార్కెటు జంక్షనులో ఆగారు. హఠాత్తుగా అన్నాడు సీతాపతి— "అరె! మన బాస్! అక్కడ నిలుచున్నాడేం. ఉండు, ఇప్పుడే వస్తా" అని, తన చేతిలోని మల్లెల పొట్లం బుచ్చిబాబు చేతిలో ఉన్న సంచిలో పడేసి వెళ్లిపోయాడు. కాస్సేపు పోయాక తిరిగి వచ్చాడు. మల్లెల సంగతి మరిచాడు. బుచ్చిబాబు సంచితో ఇల్లు చేరుకున్నాడు. 'ఎంత పనయింది! ఆ మల్లెలు తమ జడలో తురుముకుందా, రాజ్యం! ఇప్పుడు సీతాపతి వచ్చి అడిగితే ఏం చెప్పాలి?' సతమతమయ్యాడు బుచ్చిబాబు. అనుకున్నట్టుగానే సీతాపతి వచ్చి అడిగాడు, అరగంట తరవాత. సుందరమ్మ ఇంటికి వెళ్లాడు బుచ్చిబాబు. అడిగాడు. పూలు విసిరికొట్టింది రాజ్యం. "నీ బుద్ధికి పూలు కొనట మొకటా! నే నప్పుడే అనుకున్నా" అనేసిందికూడా.

'నా బుద్ధికీ, పూలు కొనడానికీ సంబంధ మేమిటీ?' అనుకున్నాడు. తరవాత తరవాత అలాగే చాలా సంఘటనలు జరిగాయి. ఏ సూచనా బుచ్చిబాబుని కదిలించలేకపోయింది. ఆ ఆప్యాయతా, అభిమానమూ అతని మనసులో ఆనందాన్నైతే కలిగించాయి గాని, ఆ పేదరాలి అనురాగాన్ని ఇసుమంతకూడా గ్రహించి ఆనందా న్నందించలేక పోయాడు. ఒకనాడు అన్నది రాజ్యం— "నాకు పెళ్లి చేస్తుందిట మా అమ్మ" అని.

"పెళ్లి చేస్తుందా? ఎప్పుడు?" సంబరపడుతూ అడిగాడు.

"ఎప్పుడో ఒకప్పుడు. మరి నీకు?"

"నాకు చెబుతావు కదూ?" అని, "పెళ్లంటే నా కెంతో సంతోషం, రాజా! పెళ్లిళ్లకి వెళ్లినప్పుడు అదంతా చూస్తే నా కెంతో ఆనందమవుతుండేది. మా అక్కలకు పెళ్లవుతే దగ్గరుండి చూడాలని కలలు కనేవాణ్ని. కాని, వాళ్లు ఏ పెళ్లీ లేకుండా వెళ్లిపోయారు. నీ పెళ్లికి నేను తప్పకుండా వస్తాను, రాజా! నీ పక్కనే కూర్చుంటా." అమాయకంగా అత నేదో చెప్పుకు పోతున్నాడు. రాజ్యం ఇక సహించలేకపోయింది.

"నా పక్కన కూర్చుంటావు. నా పెళ్లి చూస్తావ్. ఎవడో నా మెడలో తాళి కడుతుంటే చూసి ఆనందిస్తావు. ఛీ! నీకు హృదయం లేదు. మవ్వు మంత



పడుచు

చిత్రం— పి. ఆగాచార్య ( కరీం నగర్ )

బుద్ధివే కాదు. కర్కోటకుడివికూడా" అని రోషంగా పలికి, కన్నీళ్లతో గిర్రున తిరిగి వెళ్లిపోయింది. తెల్లబోయాడు బుచ్చిబాబు. పాపం బుచ్చిబాబు!

* * *

ఇప్పుడు తనకంతా అర్థమవుతూ ఉంది. ఆ రోజు ఆమె ఎంత బాధ పడిందో, ఎంత దుఃఖంతో అలా వెళ్లిపోయిందో తలుచుకుంటుంటే గుండె నీరవుతూ ఉంది. ఆ సాయంకాలం ఆమె కనిపించలేదు. మర్నాడు ఉదయమూ కనిపించలేదు. త నన్న మాటలో ఏదో తప్పు ఉంది. అందుకే కనిపించలేదు అనుకున్నాడు. కాని, అది నిజం కాదు.

"సుందరమ్మ తమ్ముడి పెళ్లాం పోయిందటరా. కబురు వస్తే వెళ్లారు" అన్నది తల్లి. నేటికి నాలుగు నెలలయింది. ఇంతవరకు రాలేదు. కాని, ఈవేళే తెలిసింది. ఉదయం ఆఫీసుకి వస్తుంటే ఇంటిగల అవ్వ ఒక కార్డు తెచ్చి ఇచ్చి చదవమంది. సుందరమ్మ వ్రాసింది. మరదలు పోవడంతో ఇల్లు, పిల్లల బాధ్యత తనపై పడిందట. ఇక ఇక్కడ ఉండదు. కూతురూ, తనూ అక్కడే ఉంటారు. ఈ రోజు వచ్చి, అద్దె ఇచ్చి సామాను తీసుకు వెళ్లిపోతారు. వెళ్లిపోయేది సుందరమ్మే. రాజ్యం వెళ్లదు. తను వెళ్లనీడు. అమ్మకు అప్పుడే చెప్పాడు.

"నువ్విప్పు డన్నావురా. కాని, అదెప్పుడో నీ మీద ఆశ పెంచుకుంది. ఆ ఆశ తీరితే నీ అంత అదృష్టవంతుడు మరొకడుండడు" అన్నది అమ్మ. అమ్మ చెప్పింది నిజం. రాజ్యం సాహచర్యంతో తన జీవనగతే మారిపోతుంది. రాజ్యం తన నిప్పుడు చూసి ఏమంటుంది?

"నాలుగు నెలల్లో ఎంత మారిపోయావు, బుచ్చిబాబూ! ఈ మార్పు ఎవరి కోసం? నా కోసమే కదూ?" అంటుంది. ఇంకా ఏమంటుంది?

ఊహలతో పులకించే బుచ్చిబాబుకి ఖాం తెలియడం లేదు. పిచ్చివాడిలా పూలవంక చూస్తూ ఉండిపోయాడు.

"కొంచెం తప్పుకోండి, మిస్టర్!" ఎవరో హెచ్చరికతో తెప్పరిల్లి పక్కకి తప్పుకున్నాడు. అర్ధ రూపాయి పూలు కొని ఇంటికి బయలుదేరాడు. రోడ్డు తిరిగి సందులో ప్రవేశించాడు. ఎదురుగా వచ్చే వ్యక్తిని చూసి త్రుళ్లిపడ్డాడు.

'రాజా!' చూస్తూ ఉండిపోయాడు.

"నువ్వా, బుచ్చిబాబూ! బాగున్నావా!" తనే ముందు పలకరించింది రాజ్యం. ఆ పలకరింపులో మునుపటి ఆప్యాయతా లేదు. చిలిపితనమూ లేదు. పెద్దరిక మేదో గోచరిస్తుంది మూర్తిలోనూ, మాటలోనూ.



మాతృమూర్తి

చిత్రం— పి. ఆగాచార్య ( కరీం నగర్ )

"ఎప్పుడు వచ్చావు, రాజా?"

"ఉదయం" అని, "ఆఫీసునుంచి వస్తున్నావా?" అన్నది.

"ఆఁ" అన్నాడు. ఆమె కనిపిస్తే ఏవో చెబుదామనుకున్నాడు. కాని, ఎదురు చూసిన ఘడియ రాగా నోరు పెగలడం లేదు.

"వస్తా. గుడికి వెళుతున్నా." అడుగు ముందుకు వేసింది.

"పద, నేనూ వస్తా." తనూ వెనక్కు తిరిగాడు. దారిలో ఎవరూ మాట్లాడ లేదు. పూలు ఇచ్చి ఏదో చెప్పాలనీ, అదెలా చెబితే బాగుంటుందోననీ యోచించ సాగాడు. గుడి చేరడమూ అయింది. భగవద్దర్శనమూ అయింది. కాని, అతను మాట్లాడలేకపోయాడు.

"కాస్సేపు తోటలో కూర్చుందామా?" తనే అన్నది రాజ్యం.

గుడివెనక తోటలోకి నడిచారు. పొన్నచెట్టు క్రింద కూర్చున్నారు.

"ఏమిటి సంగతులు?" అడిగింది రాజ్యం.

ఏమీ లేవన్నట్టు తల ఊపాడు.

"మొదట మా అమ్మ ఒక్కతే వస్తానన్న దిక్కడికి. కాని, మరి ఈ ఊరు రానేమో. ఒక్క మారు చూసిపోదామని నేనూ వచ్చా" అన్నది, రాలినపూలు ఏరి పోగుచేస్తూ.

"మరి ఎందుకు రావు?"

"ఎందుకు రావాలి? ఎవరి కోసం?" శూన్యంలోకి చూస్తూ అంది.

"రాజా!" మార్దవంగా పిలిచాడు. "ఆ రోజు ను వ్వన్నావు గుర్తుందా? నేను మందబుద్ధినేగాక, కర్కోటకుణ్ణని కూడా. నేను మందబుద్ధినేగాని, కర్కోటకుణ్ణి కాను, రాజా! ఆ మాటే నన్ను మార్చింది. బండలాటి నా జీవితాన్ని చైతన్యవంతం గావించింది. అసలు నాలో హృదయమే లేదన్నావు. ఉంది, రాజా! హృదయమెంతో ఉంది. కాని, తట్టి లేపేవారు లేక అది నిదరబోతూ ఉంది ఇన్నాళ్లూ. దానికి కారణం? మొదటి నుంచీ నేను పెరిగిన వాతావరణ మలాటిది" అని నిట్టూర్చాడు. రాజ్యం వింతగా చూడసాగింది.

"మా నాన్నగారు కొన్ని ఆశయాల్లో పెరిగేవారు. లోక మొక ఇంద్రజాలమనీ, దానిలో ఇరుక్కున్నవారు ఎందుకూ పనికి రారనీ వారి విశ్వాసం. అందుకే నన్ను లోకానికి దూరంగా ఉంచి పెంచారు. అదే నాలో అంత మాంద్యాన్ని సృష్టించింది. లోకనైజమూ, ఆత్మసౌందర్యమూ, రాగరూపమూ నా ఊహకే అందనివి. కాని. . . కాని, ఇప్పుడు మనసూ, మనసులోని మాలిమీ, అందులోని ఆనందం అర్థమై నన్ను ఉక్కిరి బిక్కిరి గావిస్తున్నాయి. నాలో మార్పు వచ్చిన దాదిగా ప్రతి క్షణం నీ రాకనే వాంఛిస్తూ గడిపాను. నా అదృష్టమే నిన్నిలా రప్పించింది" అని, మల్లెల పొట్లం విప్పాడు.

"ఒకనా డన్నావు. నీకు మల్లె లిష్టమని నా కెవరు చెప్పారని. ఈనాడు అంటున్నాను. కోకిలని కమ్మగా పాడమని ఎవరు చెప్పారో, నదిని పరుగెత్తమని ఎవ రాదేశించారో, సువాసనలు విరజిమ్మమని మల్లెల నెవరు కోరారో వారే నా మనసు నీ నాడు నీ మయం గావించారు. నా జీవితాన్నే నీ చేతుల్లో ఉంచి..." ఏదో అంటున్నాడు.

ఉలిక్కిపడింది రాజ్యం.

"బాబూ!" విభ్రమతో అతన్ని చూసింది. "ఏమిటి నువ్వంటున్నావ్!" అన్నది విస్మయంగా.

గభాలున ముందుకు వంగి ఆమె రెండు చేతులూ అందుకున్నాడు. స్నిగ్ధంగా చూస్తూ, "ఏమన్నా ఇక నేను నీ వాడిని, రాజా! తప్పైనా, ఒప్పైనా నువ్వు కాదంటే నా కిక బ్రతుకే లేదు. అది మాత్రం నిజం" అన్నాడు.

అదిరిపడింది. చేతులు వెనక్కి లాక్కుంది. పొర్లుకు వచ్చే దుఃఖాన్ని దిగమింగుతూ, "లేదు, బాబూ! ఇక మన కా అవకాశమే లేదు" అన్నది మందస్వరంతో.

"లేదని నువ్వంటావని నాకు తెలుసు, రాజా! కాని, నన్ను క్షమించు. ఆ నాడు ని న్నర్థం చేసుకోక, నీ వైఖరి గుర్తించలేక నిన్ను చికాకు పరిచాను. కాని, ఈ బుచ్చిబాబు ఆనాటి బుచ్చిబాబు కాదు. మా అమ్మ ఎప్పుడో ఒప్పుకుంది. మీ అమ్మ ఒప్పుకుంటుంది. నువ్వు. . ."

"బాబూ!" గభాలున పైటలో చేయి ఉంచి తాళిని పైకి తీసి అతనికి చూపించి, "నేను. . . నేను. . ." అని బావురుమని రెండు చేతులతోనూ ముఖం కప్పుకుని, ఇక అక్కడ ఉండలేక తోటలోకి పరుగు తీసింది. శిలాప్రతిమే అయ్యాడు బుచ్చిబాబు. కళ్లవెంబడి జారిన అశ్రువులు నేలనున్న పూలపై బడినాయి. మెల్లగా బయటికి నడిచాడు.

ఏం జరిగింది? ఏం జరిగింది? రాజా కేమయింది? తనను తనే నమ్మలేని స్థితిలో పిచ్చివాడిలా దిక్కులు చూస్తూ ఇల్లు చేరుకున్నాడు. ఇంటిముందు జనాన్ని చూసి అతని కాళ్లు వణికినాయి. అడుగు సాగలేదు.

"అమ్మ పోయింది, తమ్ముడూ!" సుందరమ్మ మాట అతని గుండెను చీల్చివేసింది. ★